క్లుప్తంగా

కె.కోటపాడు పోలీసులకు అభినందనలు



ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా రివార్డు స్వీకరిస్తున్న ఎస్.ఐ ధనుంజయ్

కె.కోటపాడు : ఈ నెల 11న కె.కోటపాడులో చోరీకి పాల్పడిన దొంగను వారం రోజుల వ్యవధిలోనే పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయంలో చొరవ చూపిన కె.కోటపాడు సీఐ తాతారావు, ఎస్ఐ ఆర్.ధనుంజయ్‌తో పాటు కానిస్టేబుళ్లు పాలవెల్లి, సాయిప్రసాద్, లీల, పైడంనాయుడును జిల్లా ఎస్పీ మురళీకృష్ణ సోమవారం అభినందించి రివార్డు అందించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గొలుగొండ: మండలంలో నాలుగు గ్రామ సచివాలయాల ద్వారా ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని.. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డేవిడ్ రాజు తెలిపారు మండలంలో గొలుగొండ, గుండిపాల, కృష్ణదేవిపేట, పుత్తడిగైరంపేట గ్రామ సచివాలయాల్లో ఈనెల 18,19,20,26,27 తేదీ ల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఆధార్ అప్‌డేట్‌కు మూడు కేంద్రాలు

మాకవరపాలెం: ఆధార్ అప్‌డేట్ చేసేందుకు మండలంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. మంగళవారం పైడిపాల, వజ్రగడ, రాచపల్లి గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

సినీ నటుడు అల్లు రమేష్ మృతి



అల్లు రమేష్ (ఫైల్)

మాడుగుల: నాటక రంగం నుండి చిత్ర పరిశ్రమకు వెళ్లి అంచెలంచెలుగా ఎదిగిన అల్లు రమేష్ (54) సోమవారం అర్ధరాత్రి విశాఖలో మృతి చెందారు. అతని మృతికి మాడుగుల పట్టణ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మృతుడు రమేష్ మాడుగులలోనే ఇంటర్ వరకు చదివారు. అనేక సాంఘిక నాటకాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. అనంతరం 80కి పైగా సినిమాల్లో రకరకాల పాత్రలు పోషించి అందరి మెప్పు పొందారు. అతని మృతికి స్నేహితులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా భూషణం



విప్ ధర్మశ్రీకి అభినందనలు తెలుపుతున్న భూషణం, నాయకులు

బుచ్చెయ్యపేట : తురకలపూడి కోపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జిగా బుదిరెడ్డి నాగభూషణం నియమితులయ్యారు. మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. ఇదే సమయంలో డైరెక్టర్లుగా గొల్లవిల్లి సత్యనారాయణ, వెలుగుల శ్రీనివాస్‌ను నియమించారు. కొత్తగా నియమితుడైన భూషణం, సర్పంచ్ గోవింద, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, వైసీపీ నాయకులు గంట్ల కాసు, మల్లేష్, దుర్గాప్రసాద్, నానాజీ, శివరామకృష్ణ తదితరులు ధర్మశ్రీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

నర్సీపట్నం: ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిషి విద్యా సంస్థల కరస్పాండెంట్ కోన సతీష్ (అధ్యక్షులు), రవితేజ కాలేజీ కరస్పాండెంట్ ఒబ్బలరెడ్డి మోహన్ ఆనంద్ (కార్యదర్శి), ప్రగతి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ ఉలబాల సత్తిబాబు (కోశాధికారి)గా ఎన్నికయ్యారు.

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు స్వీకరించాలి

కె.కోటపాడు : ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. కె.కోటపాడు మండలంలో కొరువాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 0–18 ఏళ్ల వారిలో తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేకపోయినా దరఖాస్తు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి మంగతాయరు ఉన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'



కేపీ అగ్రహారంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు



మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైస్ ఎంపీపీ నాగగోపి

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. కేపీ అగ్రహారం, దిబ్బిడి, విజయరామరాజుపేట, కందిపూడి తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సచివాలయ మండల కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. తమకు పథకాలన్నీ అవినీతికి తావు లేకుండా అందుతున్నాయని.. మరలా వైసీపీ ప్రభుత్వానికే పట్టం కడతామని ప్రజలు తెలపడంతో నాయకులు సంతోషించారు. సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం, ఎల్లపు విజయ్‌కుమార్, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, మాజీ సర్పంచ్ కనకయ్య, పంతులమ్మ తదితరులు పాల్గొన్నారు.

చమ్మచింతలో..

నాతవరం : సీఎం జగన్ మహిళా పక్షపాతి అని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. నాతవరం మండలం చమ్మచింతలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. మహిళలకు సీఎం జగన్ వర్తింపజేస్తున్న పథకాలను వివరించి ఆయనకు మహిళలు ఎల్లప్పుడూ మద్దతు పలకాలని కోరారు.

వీరనారాయణంలో..

మాడుగుల: మండలంలో వీరనారాయణం గ్రామంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సచివాలయ మండల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. సహకార సంఘం అధ్యక్షుడు విస్సారపు రామారావు, పీఏసీఎస్ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైవాడలో..

దేవరాపల్లి: రైవాడలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా నాయుడు, ఉగ్రాకుల అప్పారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తేడాను వివరించి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు అతికించారు. దేవరాపల్లిలో జరిగిన కార్యక్రమాన్ని జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ పర్యవేక్షించారు.

గవరపాలెంలో..

కె.కోటపాడు : ప్రజలకు మంచి చేయాలన్న తపనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. కె.కోటపాడులోని గవరపాలెంలో మంగళవారం రాత్రి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ లబ్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు చీపురపల్లి అచ్చిబాబు, సర్పంచ్ తోట భవాని, మాజీ సర్పంచ్ నెక్కల పెంటయ్య, మాజీ ఎంపీటీసీ గొర్లె సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గవరపాలెంలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న జెడ్పీటీసీ అనురాధ



రైవాడలో జగనన్నే మా భవిష్యత్తు బ్రోచర్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భూముల రీసర్వే పరిశీలన

రావికమతం: రావికమతంలో పూర్తి అయిన సమగ్ర భూ రీసర్వే క్యాక్రమాన్ని నర్సీపట్నం ఆర్డీవో జయరాం మంగళవారం పరిశీలించారు. సర్వే రాళ్లు పాతేటప్పుడు సమీప రైతులకు వివరించి రాళ్లు పాతాలన్నారు. పాతిన రాళ్లు ఎవ్వరైనా పీకేస్తే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ సతీష్, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్‌కు ఉచిత కోచింగ్

దేవరాపల్లి: మండలం విద్యార్థులకు బుధవారం నుండి ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్‌కు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, మండల అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను తెలిపారు. దేవరాపల్లి హైస్కూల్ ఆవరణలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 99852 50072 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆతిథ్యం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మండుతున్న ఎండల దృష్ట్యా కళాశాల పూర్వ విద్యార్థులు శీతల పానీయాల ఆతిథ్యం ఇచ్చారు. పూర్వ విద్యార్థులు నాటకుమార్, విజయ్‌కుమార్, శివ, దీవెన, రూప తదితరులు మంగళవారం కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులకు మజ్జిగతో పాటు బిస్కెట్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు వారిని అభినందించారు. నాక్ గ్రేడింగ్ రేసులో ఉన్నందున ఇలాంటి కార్యక్రమాల ద్వారా కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల పీవోలు డి.మాల్యాద్రి, డి.లక్ష్మి, బి.పిచ్చమ్మ, వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఉపన్యాసక బృందం పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు వ్యతిరేకం కాదు..

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, తమ న్యాయమైన డిమాండ్లు పరిగణనలోకి తీసుకోవాలని రోడ్డు వైడింగ్ విక్టిమ్స్ అసోసియేషన్ మెంబర్సు డిమాండ్ చేశారు. వ్యాపారులు, బిల్డింగ్ యజమానులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న రోడ్డు విస్తరణకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. తుని, అనకాపల్లిలో టీడీఆర్ గజం విలువ రూ.50 వేలు ఉంటే, నర్సీపట్నంలో రూ.5 వేలే ఉండటం వల్ల నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. వ్యాపారులు, యజమానుల ఇబ్బందులను అధికారులు పరిగణలోకి తీసుకుని తగిన న్యాయం చేయాలన్నారు.

ఘనంగా ఎం. కోటపాడు వీరాంజనేయ స్వామి తీర్థం

మాడుగుల రూరల్: మండలంలో ఎంకే వల్లాపురం, ఎం. కోటపాడు గ్రామాల ఆరాధ్య దైవం వీరాంజనేయస్వామి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉత్తరాంధ్ర ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఎం. కోటపాడు, వల్లాపురం గ్రామాల ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామ్మూర్తి, స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి, మాడుగుల పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎం. కోటపాడులో వీరాంజనేయ స్వామి సన్నిధిలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, గ్రామస్తులు

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ

రావికమతం: మేజర్ పంచాయతీ కొత్తకోటలో శిథిలావస్థలో ఉన్న మురుగు కాల్వలు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంగళవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కొత్తకోటలో అవసరమైన చోట కాలువలు, రోడ్లు, ఇతర పనులు చేపట్టేందుకు రూ.కోటీ పది లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రకటించారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

దేవరాపల్లి: ఎం. అలమండలో గాడి, సూరెడ్డి వారి కల్లాల నుండి ఎం.అలమండ–ఎస్‌జి నగరం వరకు సుమారు 600 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారని సర్పంచ్ దాడి జగన్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి తెలిపారు. రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. మట్టిరోడ్డుగా ఉన్న ఈ రహదారిని సిమెంట్ రోడ్డుగా నిర్మించాలని దశాబ్దాలుగా స్థానికులు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. వీఆర్వో పోతల శంకరరావు, పాలిపిరెడ్డి రమణ, సూరెడ్డి నానాజీ, గాడి గణేష్, గాడి వాసు, యర్రా నర్సింహమూర్తి, గాడి సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎం. అలమండలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

చోడవరం: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. అన్నవరం, చందకవీధి, అంబేడ్కర్‌కాలనీ, నాయీబ్రాహ్మణ వీధి, యాతపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ గాడి కాసు, గ్రామ సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మూడు మట్టి ట్రాక్టర్ల పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి మట్టిని తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

పనుల నాణ్యత పరిశీలన

గొలుగొండ: కొత్తమల్లంపేట పంచాయతీలో ఇటీవల జరిగిన అభివృద్ధిపనుల నాణ్యతను క్వాలిటీ డీఈఈ బి.ఎర్రాపాత్రుడు పరిశీలించారు. ఈ గ్రామంలో ఇటీవల రూ.5 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. వీటి నాణ్యతను అధికారులు పరిశీలించారు. పనులు నాణ్యంగా జరిగితేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ దైవసేవతో సమానం



దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న ధర్మశ్రీ

రావికమతం: దివ్యాంగుల సేవ దైవసేవగా ప్రభుత్వం భావిస్తోందని విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సహిత విద్య కార్యక్రమం మేడివాడ హైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయ అధికారి శకుంతల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు రూ.3 లక్షల విలువ చేసే వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, బోధన సామగ్రి కిట్లు ధర్మశ్రీ పంపిణీ చేశారు. ఎంపీపీ పైల రాజు, ఎంపీటీసీ సభ్యుడు గొర్లె సత్యారావు, హెచ్ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు ఊపిరి పోసింది దివంగత నేత వైఎస్



సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ

రోలుగుంట: గత ప్రభుత్వ హయాంలో అప్పుల్లో కూరుకుపోయిన సహకార వ్యవస్థకు ఊపిరి పోసినది దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని పలువురు రైతులు, నాయకులు అన్నారు. పీఏసీఎస్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణ మూర్తి, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి. రమణ సొసైటీ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. చైర్‌పర్సన్ తాతబాబు మాట్లాడుతూ రైతులకు మేలు చేసేలా సేవలందిస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీ రమణమ్మ, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి 23న ప్రవేశ పరీక్ష

నర్సీపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సునీత తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 5వ తరగతికి 569 మంది, ఇంటర్‌కు 325 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

సంక్షేమ, లబ్ధిని ప్రజలకు వివరించాలి

మాడుగుల రూరల్: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజలకు వివరించాలని మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన వీరనారాయణం గ్రామంలో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యులు దాడి నూకరత్నం, పీఏసీఎస్ అధ్యక్షుడు విస్సారపు రామారావు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

రోలుగుంట: రోలుగుంట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మడ్డు తాతబాబు ప్రమాణ స్వీకారం అనంతరం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్, మండల యువజనశాఖ అధ్యక్షుడు మడ్డు శివకుమార్‌ధర్మశ్రీని కలిసిన వారిలో ఉన్నారు.

పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

రోలుగుంట: రోలుగుంట పీఏసీఎస్ త్రీమెన్ కమిటీతో మంగళవారం ఆ శాఖ మోనిటరింగు అధికారి కిమడి జగన్నాథం ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్‌గా మడ్డు తాతబాబు. పర్సన్స్‌గా ద్వారపూడి నారాయణమూర్తి, యర్రంశెట్టి అప్పలనాయుడుకు అధికారిక పత్రాలు అందజేశారు.

రైతుల మేలుకు కృషి చేయాలి



డిప్యూటీ సీఎం బూడి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న సాయిప్రసాద్

కె.కోటపాడు : చౌడువాడ పీఏసీఎస్ ద్వారా సభ్య రైతులకు అన్ని విధాలా మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటూ సొసైటీని లాభాల బాటలో పయనించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. నూతనంగా చైర్మన్‌గా నియమితులైన ఆకుల సాయిప్రసాద్, డైరెక్టర్లు యడ్ల సూరిదేముడు, బండారు శ్రీరామ్మూర్తి మంగళవారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ చేతుల మీదుగా చైర్మన్ సాయిప్రసాద్ నియామక పత్రాన్ని అందుకున్నారు. డిప్యూటీ సీఎంను సన్మానించిన సాయిప్రసాద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రిపోటు వెంకటరావు, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మాడుగుల: పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఆయన గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశారు. మోదమాంబ కాలనీలో వున్న ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని, ఎస్సీ వసతిగృహ భవనాలను పరిశీలించారు. హైస్కూలు కాలనీలో రూ. కోటీ 3 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 21 సీసీ రహదారులు, డ్రైనేజీలను పరిశీలించారు. స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పంచాయితీ వార్డు సభ్యులు శీలమంతుల జ్యోతి, జవ్వాది వరహాలు, యడ్ల హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా



గాంధీనగర్‌లో సమస్యలు వింటున్న ధర్మశ్రీ

రావికమతం: కొత్తకోటలో నాల్గవ రోజూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని, కాలువ నిర్మించాలని 8వ వార్డు మహిళలు అంగజాల వరలక్ష్మి, బేరాలక్ష్మి ఆయనకు తెలపగా.. త్వరలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తమకు జగనన్న గృహాలు మంజూరైనా నేటికీ పట్టాలివ్వలేదని కోట మహేశ్వరి, సత్యవతి తెలిపారు. పింఛన్ల కోసం, ఇతర సమస్యలపై ఆయనకు పలువురు ఫిర్యాదు చేశారు. 1984లో పలువురు ఎస్సీ లబ్ధిదారులకు మంజూరైన కోళ్లఫారాల సముదాయం వృథాగా పడి ఉందని ఆ స్థలాన్ని సద్వినియోగమయ్యేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు రాజారావు, కళ్యాణం ఎమ్మెల్యేకి తెలిపారు. గ్రామంలోని ఆయుర్వేద ఆస్పత్రి తరలిపోయిందని, డిగ్రీ కాలేజీ మంజూరైనా పనులు మొదలు కాలేదని రిటైర్డ్ ఉపాధ్యాయుడు బేతా రాజారావు ఆయనకు తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ధర్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొత్తకోటలో స్థానిక సీనియర్ తబలా కళాకారుడు మల్లి లక్ష్మణరావుతో కలిసి ధర్మశ్రీ గేయాలాపన చేశారు. కుమ్మరి వృత్తిదారుని నుంచి చక్రం అందుకుని కుండ తయారు చేసి అందరినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మాజీ ఎంపీపీ కోట గాంధీ రమణమ్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, కొత్తకోట సర్పంచ్ కోనలోవ రాజు, ఉప సర్పంచ్ పందల దేవ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

మాడుగుల రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చునని ఎంపీపీ వేమవరపు రామధర్మజ పేర్కొన్నారు. సాగరం పంచాయతీ శివారు డి. సురవరం గ్రామంలో మంగళవారం రైతులతో ఖరీఫ్ ప్రణాళిక సదస్సుకు సంబంధించి గోడపత్రికను విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాథు సూర్యకాంతం, జగ్గారావు, సర్పంచ్ కోట్ని జయమ్మా, మాడుగుల పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఆందోళన హాస్యాస్పదం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

మాకవరపాలెం: టీడీపీ హయాంలో మంజూరు చేసిన మినీగోకులాలకు బిల్లులు చెల్లించకపోగా.. వారే ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ గోకులాల బిల్లులకు టీడీపీ నేతలు ఆందోళన చేస్తూ ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. గత ప్రభుత్వంలో మినీ గోకులాలను టీడీపీ వాళ్లకే మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు తమ ప్రభుత్వం రూ. 40 వేల కోట్లు చెల్లించిందన్నారు. మినీగోకులాల విషయంలో దళారులకు కాకుండా లబ్ధిదారులకే బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెట్ల భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో లక్ష్య సాధన



సమావేశంలో మాట్లాడుతున్న మాడుగుల హౌసింగ్ డీఈ శామ్యూల్‌రాజు

దేవరాపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లక్ష్యం చేరుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని మాడుగుల హౌసింగ్ డీఈ బి. శామ్యూల్‌రాజు అన్నారు. వైఎస్సార్ క్రాంతిపథం (వెలుగు) కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, వీవోఏలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులందరికీ రూ. 35 వేల రుణం తక్షణం మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. స్థానిక ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి, వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, హౌసింగ్ ఏఈ డి. భవ్య తేజ, ఏపీఎం ఎస్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



భారత్ గ్యాస్ గోదాం వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రాజేశ్వరరావు

మాడుగుల: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక భారత్ గ్యాస్ గోదాం వద్ద, ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గల పెట్రోల్ బంకుల వద్ద మాడుగుల అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కలిగించారు. అగ్నిమాపక దళాధికారి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలో మాక్‌డ్రిల్ ద్వారా తెలిపారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఫైర్‌స్టేషన్ లీడింగ్ అధికారి కృష్ణ, ఫైర్‌మేన్ మణికుమార్, సిబ్బంది నర్సింగరావు, చిన్నంనాయుడు, వరహాలు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

మంటల నిరోధానికి కార్బన్ డయాక్సైడ్

చోడవరం రూరల్: హఠాత్తుగా మంటలు వ్యాపిస్తే చేపట్టాల్సిన తక్షణ చర్యల గురించి చోడవరం అగ్నిమాపక సిబ్బంది స్థానిక పెట్రోల్ బంకులో సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన కలిగించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కేఏఎస్ పెట్రోల్ బంకులో అగ్నిమాపక దళం ప్రదర్శన నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ పీవీ రామస్వామి తన సిబ్బందితో బంకుల్లో చోటు చేసుకునే ఘటనలను వివరించి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. మంటల నిరోధానికి కార్బన్ డయాక్సైడ్ సిలిండర్లను ఎలా వాడాలన్న విషయాన్ని చూపించి అవగాహన కల్పించారు.